కథానిక

# కనపడని గాయాలు

అడుసుమిల్లి భాస్కర్

"చీకటి పడకముందే, రాబాబూ! ఏం?" అంటూ చొక్కాలాగూ ఒక్కసారి సర్ది ఆటలాడుకోడానికి పంపింది కొడుకుని సుబ్బమ్మ. చిన్నగా చిన్నగా పరిగెత్తిపోతూన్న కొడుకుని అల్లాగే చూస్తూ ఉండిపోయింది.

దూరంగా కొడుకునుంచుని ఎవరితోనో స్నేహితుడితో మాటాడుతున్నాడు. ఆ నుంచున్న పద్ధతి చూసేటప్పటికి సుబ్బమ్మ కళ్ళల్లోంచి రెండు నీటి బొట్లు మెల్లిగా జారాయి.

ఆ రోజుల్లో...

వెంకటరావుగారు ఆఫీసులో గుమాస్తాగా పనిచేస్తూండేవారు. వారియొక్క నిజాయతీ, మంచితనం గుర్తించిన ఆఫీసరుకి చాలా సన్నిహితులుగా ఉంటుండేవారు. స్వభావసిద్ధంగా ఇట్టిపరిస్థితికి ఏమాత్రం యిష్టపడని తక్కినగుమాస్తాలకు వెంకటరావుగారినిచూస్తే కన్నెర్రగా ఉండేది.

సుబ్బమ్మని పెళ్ళిచేసుకుని కాపురం పెట్టిన మరుసటేడుకే కలిగాడు రాముడు. అల్లారుముద్దుగా ఆ యువకదంపతులు కళ్ళలో మెలిగేట్టు చేసుకున్నారిద్దరూ వాడిని.

కాలంమాత్రం గడచిపోతోంది. వెంకటరావుగారిపై మొత్తంమీద ఒకరోజు వారి కసంతా తీర్చుకున్నారు గుమాస్తాలు. ఆఫీసరుగారు "ఇల్లా చేస్తే ఎల్లాగండీ-" అన్నారంతే! తనొకరోజున బాగాచేసిపెట్టి ఉంచిన పనిని వాళ్ళు నానాదరిద్రంగా తయారుచేసినట్లు తనకేమితెలుసు-పాపం చిన్నగా తీసుకుపోయిచూపాడు. ఆఫీసరు గట్టిగా అనకపోయినా అనవలసినవి, అనదలచినవి మెల్లిగా చక్కగా అన్నాడు.

ప్రపంచంలో ఎందరికటువంటి గడ్డ సమస్యలు తగలటం లేదు? కాని అందరి మాదిరిగాక వెంకట్రావు బాధపడ్డాడు. దుఃఖించాడు. మంచం పట్టాడు. చివరికి అతిసులభంగా, అతి స్వార్థంతోటి భార్యాబిడ్డలనొదిలి పరలోకంలోకి పోయాడు.

"సుబ్బమ్మ యింకా ఏదో గట్టిగుండెలు గలది కాబట్టి ఆమాత్రంగా ఉంది. మరొకరయితే ఏమయేవారో బాబూ" అనుకుని జాలిపడ్డారంతా.

పసివాడికోసం జీవిస్తోంది సుబ్బమ్మ. జీవితం మీద ఒకవిధమైన విరక్తిభావం ప్రబలంగా ఆవిడలో నాటిపోయింది. రెక్కలు గట్టిగా ఉన్నంత కాలం కొడుక్కి ప్రమాదంలేదని ఆమె నమ్ముతూ కొడుకుని చూసుకు కాలంగడుపుతోంది.

మసక చీకటి నాల్గుదిక్కులా మెలిగింది. కాని రాముడి జాడలేదు. ఆదుర్దా, ఆ వేదన, ఒకదాన్ని మించి ఒకటి మనస్సులో మెదుల్తున్నాయి. రోజూ ఇంకా వెలుతురుండగానే పరుగెడుతూ వచ్చేవాడు ఈ రోజునెందుకు రాలేదో? అన్న బాధ పీకుతోంది మనసునంతా!

బాగా చీకటిపడింది. వీధిలో ఎలక్ట్రిదీపాలు ఆయాప్రాంతాలకి మాత్రమే సంబంధించినట్లు కాంతినిస్తున్నాయి. ఆ వైపు వస్తున్న ప్రతీ వ్యక్తిమీదా సుబ్బమ్మ దృక్కులు కేంద్రీకరించి చూస్తోంది. కాని ప్రతివాడూ లైటులోకిరాగానే బయట పడిపోతున్నాడు.

అదేం కర్మోగాని ప్రతివాడూ పెద్దవాడే! ఆ సమయంలో అనుకునే పిల్లలు యింట్లోకూర్చుని చక్కగా దీపంముందు పుస్తకం పెట్టుకు చదువు సాగిస్తారు. కాని ఇంటికేవస్తూవుండరు.

ఎందరెందరో ఆఫీసులనుంచి తిరిగి వచ్చేవారు తప్ప తక్కినవారు కన్పించటంలా! వెంటనే సుబ్బమ్మ కళ్లు చెమ్మగిల్లాయి. భర్త, ఆఫీసునుంచి తిరిగిరావడం, తా నెదురుచూస్తూ ఎదురుగా వెళ్ళి కాళ్ళకు నీళ్ళివ్వడం అంతా కళ్ళకు గట్టింది. కాని ఆలోచిస్తే అంతా ఓ కలలా తోచింది. "ఆ రోజులు తిరిగివస్తాయా" అని మనసడిగింది. "రావు" అని మాత్రం చెప్పగలిగింది సుబ్బమ్మ-అంతే!

దూరంగా ఎవరో కుర్రాడు వస్తున్నాడు, చిన్నలాగూ చొక్కాగబగబ నడిచివస్తున్నాడు. ఆనడక రాముడిదల్లేనే ఉంది-పరీక్షగా చూస్తూ ఉంది. లైటులోకి వచ్చాడు. అచ్చం రాముడల్లేనే ఉన్నాడు. ఉండడమేమిటి రాముడే! అమ్మయ్య

యిప్పటికి వచ్చాకు. వీడికేం తెలుస్తుంది ఆమె పడే బాధ. చెపితే తెలిసే వయస్సాగాదు. పోని గదా అంటే ఉండలేకపోతోంది.

ఎదురుగా వచ్చిన కుర్రాడు యి తాచేసి ఆ వెంకమ్మగారి మూడోకొడుకు అని తెలుసుకునేప్పటికి మళ్ళీ ఒక్క సారి నిరుత్సాహపడింది సుబ్బమ్మ.

తిన్నగా ఎంత జూచినా మనిషి జాడలేదు. అప్పటికి అప్పుడే మనుష్యులు తగ్గుముఖంపట్టారు! మనుష్య సంచారం బాగా క్షీణించింది - తనలో ఎక్కువ ఆవేదన,బాధా పొందుతోంది సుబ్బమ్మ.

వీడెక్కడికి వెళ్ళుంటాడు? ఇంతసేపు ఆడుతుంటాడా? అబ్బే అవకాశంలేదే! ఎవరితోనా స్నేహితుడితో ఉండిమాటాడుతున్నాడా? దీనికి అవకాశంలేదు. రాముడంతటి మాటకారి కాదు. ఒకళ్ళతో ఎక్కువగా మాట్లాడటానికి తాను మాటాడనైనా మాటాడాలి. అవకాశం ఉన్నా లేకపోయినా - లేకపోతే వాడికి యెక్కువగా మాట్లాడేడానికి అవకాశం కల్పించే ప్రశ్నలైనా వేయాలి? రెండూ చేతగావు రాముడికి.

ఆటల్లో ఏమైనా దెబ్బలాడాడా?—దెబ్బలు దెబ్బలేమైనా తిన్నాడా? ఎవరితోనైనా దెబ్బలాట పెట్టుకోలేడు గదా! ఆలోచనలు రాగానే సుబ్బమ్మ మరీ కంగారుపడింది. పనిలేని ఆమె ఆలోచన లెక్కువ వచ్చాయంటే విడ్డూరమేముంది. ఆలోచించగూడదు అనుకొని తిన్నగా రోడ్డుమీదికి చూసింది.

వెలుతురులోంచి చీకటిలోకి నడుస్తున్న ఒక చిన్నకుర్రాడు కనిపించాడు. కొద్దిగా కుంటుతూ నడుస్తువస్తున్న ఆ కుర్రాణ్ణిచూస్తే రాముడేమోననిపించింది. మళ్ళీ వెంటనే "దెబ్బలాట-దెబ్బలు" చెవుల్లో, మెదడులో రింగుమన్నాయి. ఆలోచనలను అణగద్రొక్కాలంటే మనతరమా?

ఆ కుర్రవాడు మెల్లగా మళ్ళీ వెలుతురులోకి వచ్చాడు. "కాని రాముడు అంతకన్నా పొడుగుగా" అంది సుబ్బమ్మ మనస్సు. "దెబ్బమీద వంగి నడుస్తున్నాడేమో!" అంది అంతరాత్మ, వాడు రాముడే అని నిర్ధారణకొచ్చింది సుబ్బమ్మ అంతరాత్మ. "కాని నీవు తప్పుగా భావిస్తున్నావు" అంది గట్టిగా మనస్సు మళ్ళీ. ఆ కుర్రాడు తన యిల్లు దాటిపోయాడు తిన్నగా—రాముడు గాదు. కాని ఆ సమయంలో చూపిన వైచిత్రానికి నవ్వుకుంది సుబ్బమ్మ.

టైము ఏడున్నర దాటింది-ఎంత తిన్నగా చూసినా ఎక్కడా మనిషి అలికిడి గూడా లేదు. తాను వెతుకుదామనిపించింది-వేగిరపడిందిమనస్సు. గుండె వేగంగా కొట్టుకుంది. ఇంక ఇంట్లో కంపరంగా ఉంది. నిలువలేనని నమ్మకం కుదిరింది సుబ్బమ్మకు. తానింట్లో లేకుండా వెతుకబోతే-ఎక్కడకని పోతుంది-ఎక్కడికో! రాముడొ వస్తే తాను లేకపోవడం చూసి భయపడతాడేమో! అన్న ఆలోచన సుబ్బమ్మకు తట్టలేదు. తిన్నగా ఇంట్లోకిపోయి తలుపులేసేసింది. తొందరగా వీధి గొళ్ళెంవేసి తాళం వేసింది.

చకచక మెట్లుదిగింది. కళ్ళనుంచి అనుకోకుండా నీళ్లు వస్తున్నాయి. రోడ్డుమీదకొచ్చింది ఏదోగా వినిపించింది తన రాముడిగొంతు.

"అమ్మా ఎక్కడికే!"అంటున్నాడు రాముడు తన చీరెపట్టుకుని తన కెదురుపడకుండా ఎట్లా వచ్చాడా, ఇది కలా నిజమా! అనుకుంటోంది సుబ్బమ్మ.

"ఏమమ్మా అలా ఉన్నావ్" అంటూ ఆమె చేయూపాడు రాముడు.

"వచ్చావురా నాన్నా" అంటూ ఎత్తుకు ముద్దాడింది కన్నీరు కారుస్తూ.

కాసేపయ్యాక రాముడు మెల్లిగా చెప్పాడు "ఆ సూర్యం ఉన్నాడే! వాడమ్మా బలవంతం చేసి వాళ్లింటికితీసుకుపోయాడే. అందుకు ఆలస్యమయిం" అంటూ బుంగమూతి పెట్టాడు.

"వాతంద్రే ఏమనుకుంటారారా నేను" అంది రాముణ్ణి దగ్గరకి తీసుకుని సుబ్బమ్మ.

"నాయనా! నేనొక్కత్తనే ఉంటానుగా నీ వాడుకోడానికిపోతే! మరి నీవు తొందరగా రావద్దూ దీపాలెట్టక ముందొస్తే ఎంచక్కా బువ్వతిని చదువుకుని పడుకోవచ్చు గాదూ?"

"అట్లనమ్మా అలాగే!" అన్నాడు రాముడు.

"రేపటినుంచి పెందరాళే వస్తావుగా?"

"తప్పకుండా పెందరాళే వస్తానమ్మా!" అంటూ చిలిపిగా నవ్వాడు రాముడు. ఆ నవ్వులో అంతులేని ఆనందం పొందింది సుబ్బమ్మ.